సాక్షి
మంచిర్యాల
సోమవారం। 16 । సెప్టెంబర్ । 2024

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.2 /24.8

ఆకాశం కొంతమేర మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వినాయకుడికి ఎంపీ పూజలు



పూజలో పాల్గొన్న ఎంపీ వంశీ

నెన్నెల: వినాయక నవరాత్రి వేడుకల సందర్భంగా మండల కేంద్రంలోని బెస్తవాడలో ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, మహిళలు, ఎంపీని శాలువాలతో సన్మానించారు. విఘ్నాలు లేకుండా రాష్ట్ర అభివృద్ధి జరగాలనే వినాయకుడి ఆశీస్సులతో ప్రతీ కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని దేవుడిని వేడుకున్నట్లు తెలిపారు. నెన్నెల మండల అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గట్టు మల్లేశ్, గొల్లపల్లి మాజీ ఎంపీటీసీ హరీశ్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు తోట శ్రీనివాస్, మల్లాగౌడ్ పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయమే మేలు



విత్తనాలు పంపిణీ చేస్తున్న శ్యాంసుందర్

నస్పూర్ : ప్రస్తుత కాలంలో సేంద్రియ వ్యవసాయమే మేలని ఉత్తమ రైతు అవార్డు గ్రహీత శ్యాంసుందర్‌రెడ్డి అన్నారు. నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని సీతారాంపల్లి గ్రామంలో ఎఫ్‌పీసీ(ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ) హాజీపూర్ ఆధ్వర్యంలో సేంద్రియ ఆకు కూరల విత్తనాలను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్యాంసుందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతీ రైతు సేంద్రియ వ్యవసాయంవైపు దృష్టి సారించాలన్నారు. క్రిమిసంహారక మందులు వాడడం వల్ల భూమి, నీరు, గాలి కలుషితమై ప్రజలు రోగాలబారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎఫ్‌పీసీ డైరెక్టర్ బొలిశెట్టి తిరుపతి, నాయకులు గోనె శ్యాంసుందర్‌రావు, పానుగంటి రంగారావు, రైతులు కటుకూరి తిరుపతి, జాడి తిరుపతి, రాచర్ల సత్యనారాయణ, నాగమణి, గంగన్న పాల్గొన్నారు.

ఉత్తమ రైతుకు సన్మానం



శ్యాంసుందర్‌ను సన్మానిస్తున్న సభ్యులు

మంచిర్యాలటౌన్: రాష్ట్ర ఉత్తమ రైతు అవార్డును పొందిన మంచిర్యాలకు చెందిన గోనె శ్యాంసుందర్‌రావును ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేశ్, కోశాధికారి అలుగువెల్లి రమేశ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కర్ర మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

మంచిర్యాలటౌన్: బీజేపీలో చేరేందుకు ప్రజలు ఉత్సాహం చూపుతున్నారని, అందుకే సభ్యత్వ నమోదుకు విశేష స్పందన లభిస్తోందని పార్టీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. జిల్లా కేంద్రంలోని అశోక్‌రోడ్డు, ఆండాలమ్మ కాలనీ, రాజీవ్‌నగర్, ఎన్టీఆర్‌నగర్ కాలనీల్లో ఆదివారం సభ్యత్వ నమోదు చేపట్టారు. అధ్యక్షుడు హాజరై పలువురికి సభ్యత్వం అందించారు. ప్రధాని నరేంద్రమోదీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ప్రజలు స్వచ్ఛందంగా బీజేపీ సభ్యత్వం తీసుకుంటున్నారని తెలిపారు. జిల్లాలోనే అత్యధిక సభ్యత్వాల కోసం ప్రతీ ఇంటికి వెళ్లి సభ్యత్వ నమోదు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పురుషోత్తం జాజు, పెద్దపల్లి పురుషోత్తం, ఎనగందుల కృష్ణమూర్తి, జోగుల శ్రీదేవి, అమిరిశెట్టి రాజు, పచ్చ వెంకటేశ్వర్లు, తరుణ్ సింగ్ పాల్గొన్నారు.

ఆదివాసీ నాయక్‌పోడు జనగణన ప్రారంభం

కోటపల్లి: మండలంలోని కావర్ కొత్తపల్లి గ్రామంలో ఆదివాసీ నాయక్‌పోడ్ జన గణనను కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు గంజి రాజన్న, ఉపాధ్యక్షుడు రాజేశ్వరి ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టారు. ఆదివాసీ నాయక్‌పోడ్ తెగకు చెందిన కుటుంబసభ్యుల వివరాలను రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ దుగ్నెజైల్, యువజన కార్యదర్శి అంజన్‌కుమార్, జిల్లా నాయకులు రాజన్న, బాపు, రమేశ్, రాజన్న, చిన్నయ్య, మండల అధ్యక్షుడు తిరుపతి, వెంకటేశ్ పాల్గొన్నారు.



వెళ్లిరా.. వినాయకా..

- వివరాలు 9లో▸

'గణ'మైన నైవేద్యం



రాంనగర్ శివపుత్రవద్ద 108 రకాల నైవేద్యాలతో భక్తులు



రెడ్డికాలనీలోని గణేశ్ మండపంలో గణనాథునికి 108 రకాల నైవేద్యాలు..



హైటెక్‌సిటీ కాలనీలోని గణేశ్ మండపంలో లంబోదరునికి సమర్పించిన 108 నైవేద్యాలు..

గణపతి నవరాత్రి ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుగుతున్నాయి. తొమ్మిదోరోజు ఆదివారం మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదానాలు చేశారు. గణనాథునికి కూడా ఘనంగా నైవేద్యాలు సమర్పించారు. హైటెక్‌సిటీ కాలనీలోని శ్రీహరిహర క్షేత్రంలో ఏర్పాటు చేసిన వినాయకునికి 108 రకాల నైవేద్యాలు సమర్పించారు. రెడ్డికాలనీ, రాంనగర్‌లోని గణేశ్ మండపాల్లోనూ స్వామివారికి 108 రకాల నైవేద్యాలు సమర్పించారు. - మంచిర్యాలటౌన్

చూపు మందగిస్తోంది!

- పిల్లల్లో బయటపడుతున్న 'కంటి' సమస్యలు
- జిల్లాలోని 5 నుంచి 10వ తరగతి విద్యార్థులకు కంటి పరీక్షలు
- ఇప్పటికే 790 మందికి కంటి అద్దాలు, 38 మందిని శస్త్రచికిత్సకు సిఫారసు
- అక్టోబర్ వరకు కొనసాగనున్న కంటి పరీక్షలు
- ఆందోళనలో తల్లిదండ్రులు



ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం జిల్లా ఆఫీసర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు..

ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు : 31 వేలు(సుమారు)

ఏప్రిల్‌లో కంటి పరీక్ష చేసుకున్న వారు 11,900

గతనెల 20వ తేదీ నుంచి పరీక్షలు చేసుకున్నవారు 11,270

ఇప్పటి వరకు కంటి పరీక్షలు చేసుకున్న మొత్తం విద్యార్థులు 23,170

కంటి అద్దాలు తప్పనిసరిగా తీసుకోవాల్సినవారు 790 మంది

కంటికి శస్త్రచికిత్స అవసరమైన వారు 38 మంది

ఇంకా పరీక్షలు చేసుకోవాల్సినవారు 7,830 మంది

మంచిర్యాలటౌన్: సర్వేంద్రియానా నయనం ప్రధానం. కళ్లు లేకుంటే జీవితం అంధకారమే. కంటిచూపు లేని ఎంతో మంది సమాజంలో కష్టంగా జీవనం సాగిస్తున్నారు. కానీ, కళ్లు సక్రమంగా ఉన్న వారు.. తమ కళ్లను కాపాడుకోవడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లల విషయంలో తల్లిదండ్రులు చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నేడు చిన్న వయసు నుంచే.. సెల్‌ఫోన్‌కు అడిక్ట్ అవుతున్నారు. దీని ప్రభావంతో పిల్లల కళ్లపై పడుతోంది. ఫలితంగా పాఠశాల వయసులోనే పిల్లల్లో చూపు సన్నగిల్లుతోంది. తాజాగా పాఠశాలల్లో నిర్వహిస్తున్న వైద్య పరీక్షల్లో చిన్నారుల్లో అనేక కంటి సమస్యలు వెలుగు చూస్తున్నాయి.

ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో..

విద్యార్థులు కంటి సమస్యలతో బాధపడుతున్నట్లు గుర్తించిన ప్రభుత్వం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అంధత్వ నివారణ, రాష్ట్రీయ బాలస్వస్థ్య కార్యక్రమం(ఆర్‌బిఎస్‌కే) ద్వారా ఈ ఏడాది ఏప్రిల్ నుంచి కంటి పరీక్షలు నిర్వహిస్తోంది. జిల్లాలో 18 ఏళ్లలోపు చదువుతున్న విద్యార్థులకు పరీక్షలు చేస్తున్నారు. ఆర్‌బీఎస్‌కే, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఈ ఏడాది ఏప్రిల్‌లో ఆశ్రమ, రెసిడెన్షియల్ పాఠశాలల్లో 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న 11,099 మందికి కంటి పరీక్షలను చేశారు. అందులో దృష్టిలోపం కొంతమేర ఉన్న వారు 449 మందిని గుర్తించగా, 29 మందికి మెల్లతోపాటు, తప్పనిసరిగా శస్త్ర చికిత్స చేయాలని గుర్తించారు. ఆగస్టు 22 నుంచి జిల్లావ్యాప్తంగా రెండో విడత కంటి పరీక్షలు ప్రారంభించారు. ఇప్పటి వరకు 11,441 మందికి కంటి పరీక్షలు చేశారు. 341 మందికి కంటి అద్దాలు, 9 మందికి శస్త్రచికిత్స చేయాలని గుర్తించారు. శస్త్ర చికిత్సను మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి, హైదరాబాద్‌లోని సరోజినిదేవి కంటి ఆసుపత్రికి రెఫర్ చేస్తున్నారు. చిన్న సమస్యలకు అప్పటికప్పుడు మందులను అందించడం, దృష్టిలోపం ఉన్నవారికి కంటి అద్దాలను ఆర్డర్ చేసి తెప్పించే ఏర్పాట్లు చేస్తున్నారు.

దృష్టిలోపం తగ్గించాలనే

విద్యార్థుల్లో దృష్టి లోపాలు త్వరగా గుర్తించక పోవడంతో, భవిష్యత్తులో అదే సమస్య మరింత ఇబ్బందిగా మారే అవకాశం ఉంది. కంటిచూపు సమస్యల్లో ప్రధానంగా కొందరికి దగ్గరిచూపు స్పష్టంగా ఉండి, దూరంగా ఉన్న వస్తువులు కనిపించక పోవడం, కొందరికి దూరదృష్టి స్పష్టంగా ఉన్నా.. దగ్గరి వస్తువులు మసగ్గా కనిపించడం తదితర సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లుగా గుర్తించారు. కంటి చూపులో ఏ సమస్య ఉన్నా, దాని ప్రభావం చదువుతోపాటు, ఆయా విద్యార్థులపై పడే అవకాశం ఉంది. కంటి పరీక్షల ద్వారా కంటి సమస్యలను ముందుగానే గుర్తించి, అందుకు అవసరమైన మందులు, అద్దాలను ఇవ్వడంతో, అవసరాన్ని బట్టి శస్త్ర చికిత్స చేయడంతో వారిలోని దృష్టిలోపాలను తగ్గించడంతోపాటు, వారి చదువుకు ఎలాంటి ఆటంకం లేకుండా కొనసాగించేందుకు దోహదపడుతోంది. ప్రభుత్వ పాఠశాలలు, ఆశ్రమ, రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో 5వ తరగతి నుంచి ఇంటర్ సెకండియర్ వరకు చదివే ప్రతీ విద్యార్థికి కంటి పరీక్షలను నిర్వహించే కార్యక్రమాలను చేపడుతున్నారు. 5వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు కంటి పరీక్షలను పూర్తి చేసిన అనంతరం ఇంటర్ విద్యార్థులకు కంటి పరీక్షలు చేయనున్నారు. ఈ ప్రక్రియను అక్టోబర్ లోపు పూర్తి చేసేలా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆర్‌బీఎస్‌కే టీంతో, స్థానిక మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్ల సహకారం తీసుకుంటున్నారు.

దృష్టిలోపాలను గుర్తిస్తున్నాం



జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్, ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న 5వ తరగతి నుంచి పదో తరగతి వరకు చదివే విద్యార్థులందరికీ కంటి పరీక్షలను నిర్వహిస్తున్నాం. ఆ తరువాత ఇంటర్ విద్యార్థులను పరీక్షిస్తాం. ఇప్పటికే పలువురు సాధారణ కంటి సమస్యతో బాధపడుతున్నట్లుగా గుర్తించాం. వారికి అవసరమైన కంటి అద్దాలను ఆర్డర్ చేశాం. శస్త్ర చికిత్స అవసరమైన వారిని రెఫర్ చేసి, మిగతా విద్యార్థులందరికీ కంటి పరీక్షలు చేయడం జరుగుతుంది. కంటి సమస్యలు ఉండే విద్యార్థులు చదువుతోపాటు, ఇతర ఏ అంశంపై ఏకాగ్రతను పెట్టలేరు. చిన్న వయస్సులోనే కంటి సమస్యలను గుర్తించి, చికిత్స అందిస్తే వారి సమస్య తీరడంతోపాటు, చదువుతోపాటు, ఇతర యాక్టివిటీస్‌పై దృష్టిసారిస్తారు.

– డాక్టర్ అనిత, ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్

పంటల రక్షణకు శాస్త్రవేత్తతో ఫోన్‌ఇన్



కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ శివకృష్ణ

బెల్లంపల్లి: ఇటీవల కురిసిన వర్షాలకు వరి, పత్తితోపాటు ఉద్యానవన పంటలు దెబ్బతిన్నాయి. ప్రస్తుతం వర్షాలు తగ్గినా తెగుళ్ల ఉధృతి పెరిగింది. ఈ క్రమంలో పంటల రక్షణకు చేపట్టే యాజమాన్య పద్ధతులు, తెగుళ్లు, చీడపీడల నివారణకు తీసుకునే చర్యలు తెలుసుకునేందుకు 'సాక్షి' బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) ప్రోగ్రాం కోఆర్డినేటర్, శాస్త్రవేత్త కోట శివకృష్ణతో మాట్లాడే అవకాశం కల్పించింది.

సమయం : మంగళవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు

సెల్‌ఫోన్ నంబర్:
91002 29854

ఐటీఐలో 4వ దశ అడ్మిషన్లు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ప్రభుత్వ ఐటీఐలో మిగిలిపోయిన సీట్లకు 4వ దశ అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రమేశ్ తెలిపారు. https://iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 17వ తేదీన మిగిలి ఉన్న 27 సీట్లకు అడ్మిషన్లు నిర్వహిస్తామని తెలిపారు. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోనివారు 17వ తేదీ ఉదయం 11 గంటలలోపు ఆన్‌లైన్ చేసుకుని మధ్యాహ్నం 1 గంట వరకు మంచిర్యాల ప్రభుత్వ ఐటీఐలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని తెలిపారు. ఫ్యాషన్ డిజైన్ టెక్నాలజీలో 12, ఎలక్ట్రానిక్స్ మెకానిక్ 6, మెకానిక్ మోటార్ వెహికిల్ 5, టర్నర్ 3, కోప 1 మొత్తం 27 ఖాళీ సీట్లు ఉన్నట్లు వివరించారు. విద్యార్థులు ఐటీఐ రిజిస్ట్రేషన్ ఫారంతోపాటు, అన్ని ఒరిజినల్ సర్టిఫికేట్లతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు.

నిఘా నీడలో నిమజ్జనం

- జిల్లాలో రేపు వినాయక నిమజ్జనం
- గంగమ్మ ఒడికి తరలనున్న 2,251 విగ్రహాలు
- శోభాయాత్ర ప్రశాంత వాతావరణంలో సాగేలా బందోస్తు
- అప్రమత్తమైన పోలీసులు
- నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు



రామగుండం సీపీ ఎం. శ్రీనివాసులు

మంచిర్యాలక్రైం: వినాయక నవరాత్రి ఉత్సవాలు జిల్లాలో ఘనంగా జరుగుతున్నాయి. వేడుకలు తుది అంకానికి చేరుకున్నాయి. తొమ్మిది రోజులు పూజలందుకున్న గణనాథులను గంగమ్మ ఒడికి తరలించేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే చిన్న చిన్న వినాయక విగ్రహాల నిమజ్జనం జరుగుతోంది. మంగళవారం జిల్లా వ్యాప్తంగా నిమజ్జన వేడుక జరుగనుంది. ఈమేరకు పోలీసు, మున్సిపల్, రెవెన్యూ, పంచాయతీరాజ్, విద్యుత్ అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నారు. వేడుకలు ప్రశాంతంగా జరిగేలా పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాసులు ఆదేశాల మేరకు స్థానిక డీసీపీ భాస్కర్ పర్యవేక్షణలో బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో గతేడాది 1,970 గణేశ్ విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఈసారి జిల్లాలో 2,251 గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించారు. నిమజ్జనంలో భాగంగా సోమవారం సుమారు వెయ్యి విగ్రహాలను నిమజ్జనం చేస్తారని అంచనా వేస్తున్నారు.

పోలీసుల బందోబస్తు..

రెండు రోజులపాటు సాగే నిమజ్జనం సందర్భంగా ఎలాంటి ఘర్షణలు జరుగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. శోభాయాత్ర ప్రశాంతంగా సాగేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే వినాయక మండళ్ల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. శోభాయాత్ర సందర్భంగా పాటించాల్సిన సూచనలు వివరించారు. పోలీసులకు సహకరించాలన్నారు. ప్రార్థన మందిరాల వద్ద యాత్ర ఆపొద్దని, రెచ్చగొట్టే నినాదాలు చేయవద్దని తెలిపారు. మండళ్ల నిర్వాహకులు శోభాయాత్ర ప్రశాంతంగా సాగేలా చూడాలన్నారు. శోభాయాత్ర ప్రశాంతంగా జరిగేలా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా శోభాయాత్రకు సంబంధించిన రూట్ మ్యాప్‌ను పోలీసులు సిద్ధం చేశారు. రూట్ మ్యాప్ ప్రకారమే శోభాయాత్ర సాగాలని తెలిపారు. శోభాయాత్ర మార్గంలో ఇతర వాహనాలు వెళ్లకుండా ట్రాఫిక్ డైవర్షన్ చేశారు. నిమజ్జనం ప్రాంతాల్లో, శోభాయాత్ర నిర్వహించే మార్గంలో 100 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. విగ్రహాలను నిమజ్జనం చేసే గూడెం గోదావరి వంతెన వద్ద, ఇందారం గోదావరి వంతెన వద్ద, మంచిర్యాలలోని కాలేజీరోడ్ గోదావరి వద్ద ఫైర్ సిబ్బంది, గజ ఈతగాళ్లను, పోలీస్ రెస్క్యూ టీంలను సిద్ధం చేశారు. శోభాయాత్ర సందర్భంగా ఏదైనా సమస్య తలెత్తితే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని పోలీసులకు సూచించారు. సామాజిక మాధ్యమాల్లో పుకార్లు నమ్మవద్దని పేర్కొన్నారు.

డీజేలకు అనుమతి లేదు..

ఇక శోభాయాత్రలో భారీ డీజేలకు అనుమతి లేదని పోలీసులు తెలిపారు. గణేశ్ మండపాల నిర్వాహకులు శోభాయాత్రకు వినియోగించే వాహనాలు కండీషన్‌లో ఉండేలా చూసుకోవాలన్నారు. మద్యం సేవించి శోభాయాత్రలో ఎవరూ పాల్గొనకుండా నిర్వాహకులు చూసుకోవాలన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారుల సమన్వయంతో ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు.

బందోబస్తులో ఉండే పోలీసులు

సీపీ	1
డీసీపీ	1
ఏసీపీ	3
సీఐలు	10
ఎస్సైలు	40
కానిస్టేబుళ్లు	150
ట్రైనీ కానిస్టేబుళ్లు	150

శోభాయాత్ర రూట్ మ్యాప్...

- జిల్లా కేంద్రంలోని గణేశ్ విగ్రహాలు ఏసీసీవైపు నుంచి వచ్చే విగ్రహాలు వెంకటేశ్వర టాకీస్ చౌరస్తా నుంచి ముఖరం చౌరస్తా నుంచి శ్రీనివాస టాకీస్ నుంచి రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి వరకు వెళ్లి అక్కడి నుంచి 5 ఫీట్ల కంటే తక్కువ ఉన్న విగ్రహాలు కాలేజీ రోడ్‌లోని గోదావరికి వెళ్లాలి.
- 5 ఫీట్లు, అంతకన్నా ఎక్కువ ఎత్తు ఉన్న గణేశ్ విగ్రహాలను గోదావరిఖని గోదావరి బ్రిడ్జి, రాయపట్నం బ్రిడ్జి గోదావరిలో నిమజ్జనం చేయాలని సూచించారు.
- పాత మంచిర్యాల వైపు నుంచి వచ్చే విగ్రహాలు నేరుగా వెళ్లకుండా వెంకటేశ్వర టాకీస్ చౌరస్తా నుంచి ముఖరం చౌరస్తా మీదుగా శ్రీనివాస్ టాకీస్ ఓవర్ బ్రిడ్జి నుంచి వెళ్లాలి.

అనుమతి లేకుండా పట్టాలు దాటడం నేరం

బెల్లంపల్లి: నిషేధిత రైల్వే పరిసరాల్లో సంచారం చేయడం, రైలు పట్టాలు దాటడం చట్టరీత్యా నేరమని బెల్లంపల్లి రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్‌పీఎఫ్) ఏఎస్సై మోహన్ రాథోడ్ అన్నారు. పట్టణ ప్రజలకు ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏఎస్సై మాట్లాడుతూ.. ప్రయాణికుల సౌకర్యార్థం రైల్వే శాఖ నాగ్‌పూర్ –సికింద్రాబాద్ మధ్య సోమవారం నుంచి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును నడపబోతోందని తెలిపారు. అత్యంత వేగంగా నడిచే ఈ రైలుకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా సహకరించాలని సూచించారు. వందే భారత్ రైలు గంటకు 140 కిలో మీటర్ల వేగంతో నడుస్తుందన్నారు. రైల్వే శాఖ నిబంధనలు అందరూ పాటించాలని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా రైలు పట్టాలు దాటితే చర్యలకు బాధ్యులవుతారని పేర్కొన్నారు. లెవల్ క్రాసింగ్ గేట్‌లు దాటవద్దని, రైలు పట్టాలపైకి జీవాలు వెళ్లకుండా కాపరులు, యాజమానులు చర్యలు తీసుకోవాలని సూచించారు. రైల్వే స్టేషన్‌లో కదులుతున్న రైలు ఎక్కవద్దని, రైలు ఎక్కేటప్పుడు తొందరపాటు, నిర్లక్ష్యం మంచిది కాదన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, బస్తీవాసులు పాల్గొన్నారు.

సాయుధ చరిత్రను వక్రీకరిస్తున్నారు

- ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య



మాట్లాడుతున్న సీతారామయ్య

బెల్లంపల్లి/మందమర్రిరూరల్: తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వక్రీకరిస్తోందని, ప్రజలకు వాస్తవాలు తెలియకుండా గందరగోళం సృష్టిస్తోందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ)రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య ఆరోపించారు. తెలంగాణ రైతాంగ సాయుధపోరాటం 76వ వార్షికోత్సవ వేడుకలను బెల్లంపల్లి, మందమర్రిలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. బెల్లంపల్లి భగత్ సింగ్ స్థూపం, మందమర్రిలోని ఏఐటీయూసీ కార్యాలయం వద్ద సీతారామయ్య, బెల్లంపల్లి రైల్వే స్టేషన్ వద్ద సీపీఐ రాష్ట్రసమితి సభ్యుడు ఎం.వెంకటస్వామి, సీపీఐ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, స్టేషన్ రోడ్‌కాలనీలో సీపీఐ జిల్లా సీనియర్ నాయకుడు చిప్ప నర్సయ్య ఎర్రజెండాలు ఎగురవేశారు. సాయుధ పోరాట అమరులకు జోహార్లు అర్పించారు. ఆయా కార్యక్రమాల్లో సీతారామయ్య మాట్లాడారు. ప్రపంచ చరిత్రలో తెలంగాణ రైతాంగ సాయుధ గెరిల్లా పోరాటానికి ఎంతో ప్రత్యేక స్థానం ఉందన్నారు. నిజాం రాచరిక పాలనకు వ్యతిరేకంగా, రజాకార్ల ఆగడాలపై కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో చేసిన పోరాటంలో 4,500 మంది కమ్యూనిస్టులు ప్రాణత్యాగం చేసి నైజాం నిరంకుశ పాలన నుంచి ప్రజలను విముక్తి కల్పించారని తెలిపారు. మహత్తరమైన తెలంగాణ పోరాట చరితను బీజేపీ హిందు, ముస్లింల మధ్య జరిగి నపోరాటంగా చిత్రీకరించి చరిత్రను తప్పుదోవ పట్టిస్తోందని విమర్శించారు. కార్యక్రమాల్లో బి.పూర్ణిమ, ఆడేపు రాజమౌళి, అక్కెపల్లి బాపు, దాగం మల్లేశ్, బి.లక్ష్మీనారాయణ, డీఆర్.శ్రీధర్, ఉపేందర్, బి.వెంకటస్వామి, తిరుపతిగౌడ్, ఎం.లక్ష్మీనారాయణ, రాజేశం, రత్నం ఐలయ్య, రాజన్న, రాంచందర్, శ్రీనివాస్, నాగేశ్వర్, సత్యనారాయణ, సుదర్శన్, దుర్గరాజ్, రాజేశం, వెంకన్న, జనార్దన్, ఓంనారాయణ, వజ్ర తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వర్షాలకు కూలిన ఇల్లు



లక్ష్మణచాంద: మండలంలోని పీచర గ్రామంలో ఆదివారం ఇల్లు కూలింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అల్లేపు మల్లేశ్ ఇల్లు కూలిందని, ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితుడు మల్లేశ్ కోరారు.

ఈత చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలు



చికిత్స పొందుతున్న రాజాగౌడ్

నెన్నెల: మండలంలోని చిన్నవెంకటాపూర్‌కు చెందిన గీత కార్మికుడు పోతునూరి రాజాగౌడ్ ఆదివారం ఈత చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. వెన్నుపూసకు తీవ్ర గాయమైందని వైద్యులు హైదరాబాద్‌కు రిఫర్ చేయగా కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు. క్షతగాత్రుడిని ప్రభుత్వం ఆదుకుని పరిహారం అందజేయాలని గీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు కొయ్యడ మల్లాగౌడ్ కోరారు.

కొండచిలువ పట్టివేత



అడవిలో వదులుతున్న యువకుడు

తానూరు: మండలంలోని సింగన్‌గాం గ్రామ సమీపంలో లక్ష్మణ్ పోతన్నకు చెందిన సోయా పంటలో ఆదివారం భారీ కొండ చిలువ కనిపించింది. పంటలో పనులు చేస్తుండగా కూలీలు, రైతులు చూసి పరుగులు తీశారు. వెంటనే పాములు పట్టే సహభాజ్‌కి ఫోన్‌లో సమాచారం అందించారు. ఆయన అక్కడికి చేరుకుని కొండ చిలువను పట్టుకుని అటవీ ప్రాంతంలో వదలిపెట్టారు.

వాటర్ ట్యాంకు పైనుంచి పడి వ్యక్తి మృతి



మల్లేశ్ మృతదేహం

జైపూర్: మండలంలోని షెట్‌పల్లి గ్రామానికి చెందిన గోలాడ మల్లేశ్ (37) వాటర్ ట్యాంకుపై నుంచి పడి మృతి చెందగా ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..మల్లేశ్ గోదావరి నదిలో చేపలు పడుతూ జీవనం సాగిస్తున్నాడు. మూడు నెలల కిందట భార్య సుమలత పుట్టింటికి వెళ్లింది. అప్పటినుంచి మద్యానికి బానిసయ్యాడు. వారం రోజులుగా మద్యం తాగుతున్నాడు. రెండురోజుల క్రితం గ్రామంలో వాటర్ ట్యాంకు ఎక్కే క్రమంలో కింద పడిపోయి మృతి చెందాడు. ఆదివారం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత



పట్టుబడిన పశువులు

రెబ్బెన: మహారాష్ట్రలోని ధనోరా నుంచి లారీలో నిజామాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న పశువులను పట్టుకున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..మండలంలోని పుంజుమేరగూడ వద్ద జాతీయ రహదారి వద్ద ఆదివారం పెట్రోలింగ్ చేస్తుండగా పక్కా సమాచారంతో ఆసిఫాబాద్ వైపు నుంచి వస్తున్న లారీని ఆపి తనిఖీ చేస్తే 20 ఎద్దులు, 15 ఆవులు ఉన్నాయి. పశువులను తరలిస్తున్న వ్యక్తులను విచారించగా మహారాష్ట్రలోని గడ్‌చందూర్‌లోని సాధిక్ చెందిన పశువులను లారీలో తరలిస్తున్నట్లు ఒప్పుకున్నారు. సాధిక్‌తోపాటు లారీ డ్రైవర్ మహ్మద్ హతం, క్లీనర్ సయ్యద్ వాహిబ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పట్టుకున్న పశువులను కాగజ్‌నగర్‌లోని గోశాలకు తరలించి, లారీని సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.


రక్షిద్దాం.. రక్షించుకుందాం

- క్షీణిస్తున్న ఓజోన్ పొర
- పర్యావరణహిత కార్యక్రమాలతోనే పరిరక్షణ
- నేడు ప్రపంచ ఓజోన్ దినోత్సవం

ఆదిలాబాద్: మానవ చర్యల మూలంగా ప్రకృతి విధ్వంసానికి కారణమవుతున్నాడు. భూమిని సూర్యుడి నుంచి వచ్చే అతినీల లోహిత కిరణాల నుంచి రక్షిస్తున్న ఓజోన్ పొరపై పరోక్షంగా దాడి చేస్తూ, దాని ఉనికిని ప్రశ్నార్థకం చేస్తున్నాడు. చివరికి తన మనుగడకు ముప్పు కొని తెచ్చుకుంటున్నాడు. భూమిపై గల వాతావరణ పొరల్లో స్ట్రాటోపియర్లో వాయురూపంలో విస్తరించి ఉండే ఓజోన్ పొర క్షీణత జీవజాలంపై పెను ప్రభావం చూపుతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని దాని పరిరక్షణ ధ్యేయంగా ఏటా సెప్టెంబర్ 16న ప్రపంచ ఓజోన్ దినోత్సవం జరుపుకొంటున్నాం. ఈ సందర్భంగా సాక్షి కథనం.



ఆదిలాబాద్ జిల్లాలోని అటవీ ప్రాంతం



2024 ఓజోన్ డే థీమ్

ఉమ్మడి జిల్లా అటవీ ముఖచిత్రం..
ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా 2021 నివేదిక ప్రకారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా.. తెలంగాణలోని అత్యధిక అటవీ విస్తీర్ణాన్ని కలిగి ఉంది. 5,743.40 చదరపు కి.మీ మేర (35.66 శాతం) అడవులు విస్తరించి ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా 54.41 శాతంతో కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రథమ స్థానంలో ఉండగా, మంచిర్యాల 45.15, ఆదిలాబాద్ 42.79, నిర్మల్ 32.62 శాతాలతో తర్వాతి స్థానాల్లో నిలిచాయి. అత్యధిక అటవీ విస్తీర్ణంతో ఉమ్మడి జిల్లా ఓజోన్ పునరుద్ధరణకు పరోక్ష కారణమవుతోంది.

ఓజోన్ అంటే..
భూమిని ఆవరించి ఉన్న వాతావరణ పొరల్లో ఓజోన్ అనేది 16 నుంచి 55 కి.మీ మేర విస్తరించి ఉన్న స్ట్రాటో స్పియర్లో ఉంటుంది. భూమి చుట్టూ ఆవరించి ఉండే మొదటి పొర ట్రోపోస్పియర్లోని ఆక్సిజన్(ఓ2) అణువులు రూపాంతరం చెంది స్ట్రాటోస్పియర్లో ఓ3 అణువులుగా మారుతాయి. ఈ ఓ3ని ఓజోన్ వాయువుగా వ్యవహరిస్తారు. ఈ అణువులన్నీ ఓజోన్ పొరగా ఏర్పడతాయి. సూర్యుడి నుంచి వచ్చే అతినీలలోహిత కిరణాలు భూమిపై చేరకుండా అడ్డుకుంటాయి. ఈ విధంగా భూమిపై ఉన్న జీవజాలానికి ఎలాంటి నష్టం కలగకుండా ఓ రక్షణ కవచంలా ఓజోన్ పొర ఉంటుంది. అయితే మనిషి అనాలోచిత చర్యలతో ఓజోన్ పొరకు రంధ్రాలు ఏర్పడుతుండడం కలవరపాటుకు గురిచేస్తోంది.

ప్రధాన కారణాలివే..
ఓజోన్ పొర సన్నగిల్లడానికి ప్రధాన కారణంగా క్లోరోఫ్లోరో కార్బన్లు (సీఎఫ్‌సీ) నిలుస్తున్నాయి. వీటి వల్ల మానవాళికే కాకుండా సమస్త జీవరాసులపైన తీవ్ర ప్రభావం పడుతున్నాయి. రిఫ్రిజిరేటర్, ఏసీలు వంటి వాటిల్లో వినియోగిస్తున్న సీఎఫ్‌సీలు, హైడ్రో సీఎఫ్‌సీలు వాతావరణంలో పేరుకుపోయి స్ట్రాటోస్పియర్లో గల ఓజోన్‌తో చర్య పొంది ఆ అణువులను విడగొట్టి ఆక్సిజన్‌లా మారుస్తున్నాయి. పొరలో ఓ3 అణువులు ఓ2 వాయువుగా మారుతుండడంతో ఓజోన్ పలుచబడుతోంది. పంటలపై చల్లే స్ప్రే, ఫోమ్, డిటర్జెంట్లు, ప్లాస్టిక్ వస్తువుల తయారీ, రిఫ్రిజిరేటర్ల తదితర వినియోగంతో క్లోరోఫ్లోరో కార్బన్లు వాతావరణంలోకి విడుదలవుతున్నాయి. అదే విధంగా బ్రోమిన్ సైతం ఓజోన్ పొరను ఛిద్రం చేయడంలో ప్రధాన పాత్ర పోషిస్తుంది.

అనేక దుష్ఫలితాలు..
ఓజోన్ పొర క్షీణిస్తుండడంతో అతినీలలోహిత కిరణాలు భూమిపైకి చేరుతున్నాయి. దీంతో మనుషుల్లో చర్మ సంబంధ వ్యాధులు, రోగ నిరోధక శక్తి తగ్గడం, కంటి సంబంధ వ్యాధులు, చర్మ, క్యాన్సర్ బారినపడే అవకాశం ఉంది. జంతువులపై ఇవి మరింత తీవ్ర పరిణామాలు చూపుతున్నాయి. అలాగే మొక్కల్లో కిరణజన్య సంయోగ క్రియ రేటు తగ్గి మొక్కల ఆహార తయారీలో ఆటంకాలు ఏర్పడే అవకాశాలు ఉంటాయి. సముద్ర జీవజాలంపై పరోక్షంగా ఈ ప్రక్రియ ప్రభావితం చూపిస్తుందని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. ఉష్ణోగ్రతలు పెరిగి, భూమి అగ్నిగోళంలా మారుతుందనే హెచ్చరికలు లేకపోలేదు.

బీసీ కమిషన్ సభ్యురాలికి సన్మానం



లక్ష్మిని సన్మానిస్తున్న నాయకులు

నిర్మల్‌టౌన్: తెలంగాణ బీసీ కమిషన్ సభ్యురాలు, ఓయూ జేఏసీ నేత రంగు బాల లక్ష్మిని ఆదివారం హైదరాబాద్‌లో నిర్మల్‌కు చెందిన గౌడజన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ, జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు శాలువా కప్పి సత్కరించారు. తెలంగాణ ఉద్యమకారిణి లక్ష్మిని బీసీ కమిషన్ సభ్యురాలిగా నియమించడం హర్షనీయమని కొనియాడారు. నాయకులు అమరవేణి నర్సాగౌడ్, అనుములభాస్కర్ తదితరులు ఉన్నారు.

ఇంట్లో చోరీ

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని మహాలక్ష్మి వాడకు చెందిన మద్దుల రాకేశ్ ఇంట్లో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో గుర్తుతెలియని దుండగులు చొరబడి రూ.10వేల నగదుతోపాటు గ్యాస్ సిలిండర్‌ను ఎత్తుకెళ్లినట్లు బాధితుడు టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపారు.

పంటల సాగుపై రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

బెల్లంపల్లిరూరల్: పంటల సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ కళాశాల (పొలాస) జగిత్యాల విద్యార్థులు అన్నారు. మండలంలోని ఆకెనపల్లిలో గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా పంటల సాగుపై రైతులకు ఆదివారం అవగాహన కల్పించారు. పీపీఈ కిట్లు, చేతులకు గ్లౌజ్‌లు ధరించి పొలాల్లో రసాయనిక మందులు, ఎరువులు పిచికారి చేయాలన్నారు. పిచికారి అనంతరం మందు డబ్బాలను భూమిలో పాతి పెట్టాలన్నారు. అధిక మోతాదులో రసాయనిక ఎరువులు పిచికారి వల్ల దిగుబడి తగ్గుతుందని తెలిపారు. రైతులు వ్యవసాయ శాఖ, కృషి విజ్ఞాన కేంద్రం అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ అధిక దిగుబడి పొందాలన్నారు. విద్యార్థులు తిరుపతి, శ్రీధర్, పవన్, మణిదీప్, నవతేజ్, నరేశ్, రైతులు పాల్గొన్నారు.

పత్తిలో పిండినల్లి

- కాండం, కొమ్మలను పీల్చే పురుగు
- నివారణ చర్యలతోనే అరికట్టవచ్చు



పత్తిని ఆశించిన పిండినల్లి



పత్తి పంట

చెన్నూర్‌రూరల్: పత్తి పంటల్లో చీడపీడను ఆశించే పిండినల్లి పురుగులు ప్రధానమైంది. ఆగస్టు నుంచి అక్టోబర్ వరకు ఈ పంటలకు పురుగులు ఆశిస్తుంటాయి. ఇవి చిన్నవిగా ఉండి మెత్తగా, లేత గులాబీ రంగులో ఉంటాయి. పత్తి కొమ్మలు, కాండం, మొగ్గలు కాయల నుంచి రసాన్ని పీల్చుతాయి. దీని ద్వారా మొక్కల్లో సాధారణంగా జరిగే ఆవశ్యక మూలకాలు, పదార్థాల సరఫరాలో అంతరాయం ఏర్పడి మొక్కలు ఎదగక గిడసబారిపోతాయి. కణుపుల మధ్య దూరం తగ్గి మొక్క గుబురుగా చిన్నదిగా కనిపిస్తుందని, దీని నివారణకు చర్యలు చేపట్టాలని ఏవో మార్క్‌గ్లాడ్‌స్టన్ సూచిస్తున్నారు.

పిండినల్లి ఆశించే విధానం..
పిండినల్లి పురుగులు..పొలంగట్లపై అలాగే పనికిరాని భూముల్లో పెరిగే కలుపు మొక్కల ద్వారా వ్యాపిస్తాయి. బెండ, టమాట, వంగ, క్యాబేజీ, బొప్పాయి, నిమ్మ, జామ, మందార, గోగు, చామంతి, గడ్డి చామంతి, రామబాణం, వయ్యారిభామ, తుత్తర బెండ, సీతాఫలం, సుబాబుల్, గ్లెరిసిడియా వంటివి పిండినల్లికి అతిథి మొక్కలు. అధిక సంతానోత్పత్తి, అల్ప జీవితకాలం, ఈ పురుగు సాధారణంగా ఏడాదిలో 15 తరాలకు అభివృద్ధి చెందగలదు. ఆడ పురుగు పెట్టే ఒక గుడ్ల సంచిలో దాదాపు 600 వరకు గుడ్లు ఉంటాయి. పొలంలో సహజంగా పెరిగే మిత్ర పురుగులు అంతరించి పోవడంతో పురుగు విసర్జించే తేనె వంటి ద్రవం కోసం వచ్చే చీమల ద్వారా ఒక మొక్క నుంచి మరో మొక్కకు పురుగు వ్యాపిస్తుంది. ఈ పురుగు..పంట ఉత్పత్తులు, పత్తి కర్రల ద్వారా గాలి, నీటి కాలువలు, వర్షం, పక్షులు, పశువుల ద్వారా వ్యాపిస్తుంది.

నివారణ చర్యలు..
పిండినల్లి పురుగులు మొదటగా గట్ల పక్కన ఉండే పత్తి వరుసల్లో అక్కడక్కడ ఆశించి తర్వాత మిగతా మొక్కలకు వ్యాపిస్తాయి. ఈ దశలో పురుగు ఆశించిన మొక్కలను పీకి కాల్చివేయాలి. ఇలా చేయడం ద్వారా దాని విస్తరణను అదుపులో ఉంచవచ్చు. పొలం గట్లపైన ఉండే కలుపు మొక్కలు ముఖ్యంగా వయ్యారిభామ, తుత్తురబెండ, గడ్డిచామంతి, తదితర కలుపు మొక్కలను పీకి కాల్చివేయాలి. జైగోగ్రామ బైకోలరేట్ మిత్ర పురుగులను హెక్టార్‌కు 500–1000 వరకు విడుదల చేయాలి. తద్వారా వయ్యారిభామ, కలుపు మొక్కలను నివారించవచ్చు. దీని ద్వారా పిండినల్లి ఉధృతి తగ్గించవచ్చు. పత్తి ఏరిన తర్వాత ఎండు కర్రలను పీకి కాల్చివేయాలి. వేసవి దుక్కులు ద్వారా నేలలో దాగి ఉండే పిల్ల పురుగులను నియంత్రించవచ్చు. అంతర పంటగా అలసంద, బబ్బెర, సోయాబీన్, మినుము తదితర పంటలను సాగు చేయడం ద్వారా మిత్ర పురుగుల సంఖ్యను ఏ వృద్ధి చేయవచ్చు. కంచె పంటగా లేదా రక్షక పంటగా రెండు వరుసల సజ్జ లేదా కందులను దట్టంగా పెంచాలి. దీని ద్వారా పత్తిలో పిండినల్లి ఉధృతి తగ్గించుకోవచ్చును. మొక్కలను పురుగు ఆశించినట్లయితే లీటరు నీటిలో 10 మి.లీ వేపనూనెతోపాటు ఒక గ్రాము సబ్బు పొడిని కలిపి 10 నుంచి 12 రోజుల తేడాతో మొక్క కాండం, కొమ్మలు, ఆకులపై అలాగే చుట్టూపక్కల మొక్కలపైన పిచికారి చేయాలి. మోనోక్రోటోపాస్ నీరు 1:4 నిష్పత్తిలో కలిపిన ద్రావణాన్ని పంట విత్తిన 20, 40, 50 రోజుల వ్యవధిలో మొక్కల లేత కాండాలపై బ్రష్‌తో పిచికారి చేసినట్లయితే పిండినల్లిని సమర్థవంతంగా అరికటవచ్చు. తద్వారా మంచి దిగుబడి పొందవచ్చు.

వేర్వేరు కారణాలతో పలువురు ఆత్మహత్య



ఓర్సు రాజు (ఫైల్)

బావిలో దూకిన వ్యక్తి..
గుడిహత్నూర్: ఉమ్మడి జిల్లాలో వేర్వేరు కారణాలతో పలువురు ఆత్మహత్య చేసుకున్నారు. బోథ్ మండలం కొత గ్రామానికి చెందిన ఓర్సు రాజు (39) అనారోగ్య సమస్యలతో బాధపడుతూ జీవితంపై విరక్తితో వ్యక్తి బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. రాజు 15 ఏళ్ల క్రితం గుడిహత్నూర్‌కు చెందిన లలితను వివాహం చేసుకుని ఇక్కడే స్థిరపడ్డాడు. భార్యాభర్తలు ఇద్దరూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. వీరికి ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరిలో చిన్నవాడు పుట్టుకతో దివ్యాంగుడు కావడంతో రాజు తరచూ బాధపడేవాడు. దీనికితోడు రాజుకు అనారోగ్య సమస్యలు తలెత్తాయి. తీవ్ర మనస్తాపంతో శనివారం రాత్రి గుడిహత్నూర్‌లోని వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై బలిరాం పేర్కొన్నారు.

జీవితంపై విరక్తితో ఒకరు..
కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని సర్‌సిల్క్‌కాలనీకి చెందిన అశోక్ యాదవ్ జీవితంపై విరక్తితో ఆదివారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణ ఎస్సై సుధాకర్ కథనం ప్రకారం..అశోక్ యాదవ్ (42) గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తితో ఇంట్లో ఉరేసుకున్నాడు. మృతుడి భార్య సరస్వతి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఉరేసుకుని ఒకరు..
భైంసారూరల్: మండలంలోని దేగాం గ్రామానికి చెందిన ఎర్రన్న ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..ఎర్రన్న (40) మదానికి బానిసై ప్రతీరోజు కుటుంబ సభ్యులతో గొడవపడేవాడు. శనివారం భార్య హంసతో గొడవకు దిగాడు. ఆమె మనస్తాపంతో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబీకులు భైంసా ఏరియాస్పత్రికి తరలించారు. ఆదివారం చికిత్సపొందుతున్న భార్య హంస వద్దకు వచ్చి మరోసారి గొడవపడి ఇంటికి వెళ్లాడు. హంస చీరలను తగులబెట్టి సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. మృతుడి కుమారుడు మహేశ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అడ గ్రామంలో వివాహిత..
ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని అడ గ్రామానికి చెందిన వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై రాజేశ్వర్ కథనం ప్రకారం.. ఆదివారం మధ్యాహ్నం హండే గంగుబాయి (28) బట్టలు ఉతకడానికి వెళ్లి ఇంటికి ఆలస్యంగా వచ్చింది. ఎందుకు ఆలస్యమైందని భర్త లక్ష్మణ్ అడగడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఆ తర్వాత భర్త బయటకు వెళ్లాడు. తిరిగివచ్చే సరికి భార్య ఇంట్లో దులానికి ఉరేసుకుంది. గంగుబాయి తండ్రి దేవాజీ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

జైనూర్‌కు వెళ్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అరెస్టు



డీఎస్పీతో మాట్లాడుతున్న ఎంపీ, ఎమ్మెల్యే

ఉట్నూర్‌రూరల్: జైనూర్ ఘటనలో బాధితులను పరామర్శించేందుకు ఆదివారం వెళ్తున్న ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, బీజేపీ నేతలను ఉట్నూర్ ఎక్స్‌రోడ్డు వద్ద పోలీసులు అరెస్టు చేశారు. ప్రజాప్రతినిధులుగా వెళ్తున్న తమకు అనుమతి ఇవ్వాలని కోరగా నిషేధాజ్ఞల నేపథ్యంలో అనుమతి లేదని డీఎస్పీ నాగేందర్, సీఐ మొగిలి స్పష్టం చేశారు. ఎంపీ, ఎమ్మెల్యే వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మనంద్, జాతీయ నాయకులు రితేశ్ రాథోడ్, కొండేరి రమేశ్, నాయకులు రవీందర్, కౌన్సిలర్ ప్రవీణ్, అశోక్‌రెడ్డి, గణేశ్ తదితరులు ఉన్నారు.

ఎన్‌సీసీ కేడెట్లు దేశసేవ చేయాలి

ఆదిలాబాద్: ఎన్‌సీసీ కేడెట్లు దేశసేవ చేయాలని ఉమ్మడి జిల్లా ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ వికాస్‌శర్మ అన్నారు. జిల్లాకేంద్రంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో తెలంగాణ 32 బెటాలియన్ సీఏటీసీఐ శిక్షణ శిబిరాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 23వ తేదీ వరకు ఎన్‌సీసీ క్యాంపు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ క్యాంపులో ఉమ్మడి జిల్లాకు చెందిన 600 మంది కేడెట్లు పాల్గొంటారని వివరించారు. కార్యక్రమంలో ఏఎన్‌వోలు జగ్గరాం, గాలి అశోక్, స్వామి, పూర్ణచందర్, రజిత, రాజేశ్వరి, శ్రీనివాస్, సాయినాథ్, వినోద్, ఉమేష్ కుమార్ పాల్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు అధికారులను మోసం చేసిన వ్యక్తి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ బన్సిలాల్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు అధికారులను మోసం చేసిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ బన్సిలాల్ తెలిపారు. పోలీసుస్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ మేరకు వివరాలు వెల్లడించారు. గతనెల 3న గుర్తుతెలియని వ్యక్తి మాస్క్ ధరించి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు వచ్చి క్యాష్ కౌంటింగ్ మిషన్ రిపేర్ చేస్తానని చెప్పి రూ.50 వేలు నగదుతో పారిపోయాడు. బ్యాంక్ మేనేజర్ ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేశారు. సీఐతోపాటు ఎస్సై వినిత సీసీసీ పుటేజీ ఆధారంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిందితుడు రోహిత్ బాబులాల్ ప్రకాశ్‌కాలేను ఆదివారం పట్టుకున్నారు. నిందితుడు మహారాష్ట్రలోని యావత్మాల్ జిల్లా పని గ్రామానికి చెందిన వ్యక్తి. కుటుంబ సభ్యులతో కలిసి గతకొన్నేళ్లుగా సికింద్రాబాద్‌లో ఉంటున్నాడు. గతంలో క్యాష్ కౌంటర్ మిషన్లు, ప్రింటింగ్, జిరాక్స్ మిషన్లు రిపేరు చేసేవాడు. కొంత కాలంగా జులాయిగా తిరుగుతుండేవాడు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో మెదక్, మంచిర్యాల హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో అధికారులను నమ్మించి మోసాలకు పాల్పడుతున్నాడు. మంచిర్యాలలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు వచ్చి క్యాష్ కౌంటింగ్ మిషన్ రిపేరు చేసినట్లు చేసి అధికారులను కౌంటింగ్ నిమిత్తం రూ. 50వేలు ఇవ్వాలని అడిగి వాటితో పరారయ్యాడు. ఈ మేరకు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

18న కలెక్టరేట్ ఎదుట ధర్నా



సమావేశంలో మాట్లాడుతున్న బ్రహ్మానందం

నస్పూర్: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో ఈ నెల 18న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయనున్నట్లు యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.బ్రహ్మానందం తెలిపారు. శ్రీరాంపూర్‌లోని యూనియన్ కార్యాలయంలో ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం శ్రీరాంపూర్ ఏరియా కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మానందం మాట్లాడుతూ తెలంగాణ భవన, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా అమలు చేస్తున్న ప్రమాద, సహజ మరణ, శాశ్వత, పాక్షిక అగవైకల్యం వంటి నాలుగు పథకాలను ప్రభుత్వం ఇన్సురెన్స్ కంపెనీలకు టెండర్ల ద్వారా అప్పగించే ప్రయత్నాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశా రు. డిమాండ్ల సాధనకు జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 23న చలో హైదారాబాద్ కార్యాక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. భవన నిర్మాణ కార్మికులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో నేదురి నర్సయ్య, మంతెన లక్ష్మయ్య, సుగుణ, లక్ష్మి, విజయ తదితరులు పాల్గొన్నారు.

నిండుగా 'ఎల్లంపల్లి'

మంచిర్యాలరూరల్(హాజీపూర్):ఎల్లంపల్లి పూర్తిస్థాయి నీటిమట్టంతో జలకళ సంతరించుకుంది. ప్రస్తుతం ప్రాజెక్టు మొత్తం 20.175 టీఎంసీలకుగాను 20.175 టీఎంసీల నీటి సామర్థ్యంతో ఉంది. ఎగువ నుంచి 15 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ఔట్‌ఫ్లో కింద 5 గేట్లు తెరిచి 14 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. హైదరాబాద్ మెట్రో వాటర్‌వర్క్స్ పథకానికి 305 క్యూసెక్కులు,ఎన్టీపీసీకి 121 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు.



పూర్తిస్థాయి నీటిమట్టంతో ఎల్లంపల్లి జలాశయం

తనయుడి చేతిలో తండ్రి హతం

- చికిత్స పొందుతూ మృతి
- ఆస్తిపంపకం విషయమై గొడవ

ఉట్నూర్‌రూరల్: ఆస్తి కోసం తనయుడు తండ్రిని హతమార్చిన ఘటన మండలంలోని రాజన్నగూడెంలో చోటుచేసుకుంది. ఎస్సై మనోహర్ కథనం ప్రకారం..రాజన్నగూడెనికి చెందిన భాగ్యవాన్..ఆస్తి పంపకం విషయమై తండ్రి భూమన్న (65)తో కొన్నిరోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ విషయమై గత ఆగస్టులో తండ్రితో గొడవపడి దాడి చేశాడు. తండ్రి ఫిర్యాదుతో స్థానిక పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. మూడు రోజుల క్రితం తనయుడు ఇనుప రాడ్‌తో తండ్రి ముఖంపై దాడి చేయగా తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతన్ని ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. చికిత్సపొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.